నమస్తే తెలంగాణ



## బీఆర్ఎస్ నేతలకు ప్రతీకార నోటీసులు: దాసోజు



హైదరాబాద్ జూన్ 14 (నమస్తేతెలంగాణ): ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలకు అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతీకార నోటీసులను జారీ చేయిస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ విమర్శించారు. ఆర్థిక దివాలా, చెల్లించని బిల్లులు, సంక్షేమ పథకాల రద్దు, నెరవేర్చని ఎన్నికల వాగ్దానాలు, అసమర్థ విధానాలు, అవినీతి ఆరోపణల నుంచి దృష్టి మళ్లించేందుకే రేవంత్ సర్కారు దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. బలవంతపు చర్యలు, ప్రతీకార నోటీసులు, అక్రమ కేసులు కేటీఆర్ లాంటి నాయకుడి సంకల్పాన్ని కదిలించలేవని శనివారం ఎక్స్ వేదికగా స్పష్టంచేశారు.

## కడిగిన ముత్యాల్లా తిరిగొస్తరు: సుంకె



కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 14: కేసీఆర్, కేటీఆర్‌పై కుట్రలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని నోటీసులు పంపినా, ఎన్ని కేసులు పెట్టినా కడిగిన ముత్యాల్లా తిరిగొస్తారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం, ఫార్ములా వన్ తదితర కేసులు పెడుతున్నదని, వీటిల్లో ఒక్కటి కూడా నిలిచేది కాదని తేల్చిచెప్పారు. ఈ నెల 25న రైతు భరోసా వేస్తామన్న మంత్రి తుమ్మల.. గతంలో మాదిరిగా కాలయాపన చేయొద్దని డిమాండ్ చేశారు.

## హామీలపై ప్రశ్నిస్తే నోటీసులా?: కిషోర్‌గౌడ్


హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు గురించి అడుగడుగునా ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీతో కేసులు పెట్టిస్తారా? అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కిషోర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. కేటీఆర్‌పై మరోసారి ఏసీబీ నోటీసులు ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. పాలన చేతగాక, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రజల దృష్టిని మరల్చడం కోసమే సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణను, హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలబెట్టేలా నాడు మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ విశేష కృషిచేశారని ఆయన కొనియాడారు.

# రేవంత్ బూతులు.. పోలీసులకు సూక్తులు

# కేటీఆర్‌పైనే కేసులు

మొదటిపేజీ తరువాయి...

ఫార్ములా-ఈ కేసు పెట్టి ఇబ్బందులకు గురి చేయాలనుకున్న ప్రభుత్వ పాచిక పారకపోవడంతో ఇప్పుడు పక్క దారులు వెతుకుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే ఎక్కడ వీలైతే అక్కడ కేసులు నమోదు చేస్తున్నట్టు తెలిసింది. కేటీఆర్‌పై ఎంత ఎక్కువ వీలైతే అన్ని కేసులు నమోదు చేయాలని ప్రభుత్వ పెద్దల నుంచి పోలీస్ బాస్‌లకు ఆదేశాలు అందినట్టు చర్చ జరుగుతున్నది. ఇందులో భాగంగానే తిట్టుకాని తిట్టు పేరుతో కేసు నమోదు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



### మరి రేవంత్‌వి భక్తి ప్రవచనాలా ?

'ఒక చిల్లర గాడు ఇవాళ రాష్ర్టానికి ముఖ్యమంత్రి కావడం మన ఖర్మ. ఏం చేద్దాం. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అంటాడు. కాళేశ్వరం అంటే ఈ సన్నాసికి తెలియదు. నల్లగొండకు వెళ్లి గంధమల్ల ప్రాజెక్టు పూర్తి చేస్తా అన్నాడు. కాళేశ్వరం లేకుంటే గంధమల్ల ఎక్కడిది రా హౌలా' ఇలా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి కేటీఆర్ తిట్టినట్టు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేటీఆర్‌వి తిట్లయితే మరి సీఎం రేవంత్‌రెడ్డి బూతు పురాణాన్ని ఏమనాలి? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 'నా కొడుకుని పండవెట్టి తొక్కి పేగులు మెడలేసుకుంటా, సన్నాసోడా, సవట, దద్దమ్మ, దివానాగా, సన్నాసి, రండ, హౌలా, మార్చురీకి పోతడు' ఇదీ పలు సందర్భాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వాడిన జుగుప్సాకరమైన భాష! కొన్ని సందర్భాల్లో అయితే ఏకంగా కేసీఆర్ మరణాన్ని కోరుకునేలా ఆయన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'స్ట్రెచర్ నుంచి మార్చురీకి పోతరు, నీ చరిత్ర ఫామ్‌హౌస్‌లోనే శాశ్వతంగా సమాధి అయిపోతుంది' అంటూ కేసీఆర్ మరణాన్ని కాంక్షించే వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. సీఎం వ్యాఖ్యలను తెలంగాణ ప్రజలు తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి శైలిపై రాష్ట్రమంతా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తిట్లయితే.. సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు చేసిన వ్యాఖ్యలు భక్తి ప్రవచనాలా? అన్న ప్రశ్నలు రాజకీయ విశ్లేషకుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### అవి తిట్లు కావా? సీఎంపై కేసులేవి?

పలు సందర్భాల్లో మాజీ సీఎం కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వింటే ఎవరికైనా రోత పుడుతుంది. కానీ పోలీసులకు మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి తిట్టినవి తిట్లు కావు.. ఆయనపై కేసులు లేవు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు న్నాయి. కేటీఆర్ వాడుక భాషగా మాట్లాడిన మాటలనే తిట్లుగా ఫిర్యాదు చేస్తే.. ఆగమేఘాలపై కదిలి.. కేటీఆర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈ వేగాన్ని ప్రతిపక్ష పార్టీ నేతల ఫిర్యాదుపై ఎందుకు చూపడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కేసీఆర్‌ను ఉద్దేశించి అన్ని తిట్లు తిట్టిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు లేవని పలువురు రాజకీయ ప్రముఖులు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ తిట్ల ఆధారంగా కేసులు నమోదు చేయాల్సి వస్తే ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై వందల సంఖ్యలో కేసులు నమోదయ్యేవని అభిప్రాయపడుతున్నారు.

### బీఆర్ఎస్ నేతల ఫిర్యాదులు బుట్టదాఖలు

ప్రతిపక్ష నేతలపై అధికార పార్టీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా వారిపై ఆగమేఘాలపై కేసులు నమోదు చేస్తున్న పోలీసులు.. అదే సమయంలో అధికార పార్టీ నేతలపై ప్రతిపక్ష నేతలు ఇచ్చిన ఫిర్యాదులపై మాత్రం స్పందించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష నేతలు ఇచ్చిన ఫిర్యాదలు బుట్టదాఖలు చేస్తున్న పోలీసులు అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులొత్తుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూసీకి అడ్డొస్తే బుల్డోజర్లతో తొక్కిస్తామంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీ బాల్క సుమన్ తదితరులు నిరుడు నవంబర్ 9న బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటి వరకు చర్యల్లేవు. మొన్నటి మార్చిలో కేసీఆర్‌ను ఉద్దేశించి స్ట్రెచర్ నుంచి మార్చురీకి పోతరు అంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపైనా పోలీసుల స్పందన లేదు. సీఎంపై ఎలాంటి కేసూ నమోదు చేయలేదు. ఇలా పలు మార్లు సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు చేసిన ఫిర్యాదులను పోలీసులు బుట్టదాఖలు చేశారు.

### టార్గెట్ బీఆర్ఎస్ నేతలు

ప్రస్తుతం రాష్ట్రంలో 'టార్గెట్ బీఆర్ఎస్ నేతలు' అన్నట్టుగా నడుస్తున్నదనే చర్చ జరుగుతున్నది. బీఆర్ఎస్ నేతలు ఎవరైనా సరే తుమ్మితే కేసు.. దగ్గితే కేసు.. ప్రజల తరపున ప్రశ్నిస్తే కేసు.. రైతుల తరపున నిలదీస్తే కేసు.. విద్యార్థుల తరపున పోరాడితే కేసు.. ఇలా సందర్భం ఏదైనా సరే బీఆర్ఎస్ నేతలపై కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. కేటీఆర్, హరీశ్‌రావు, జోగినపల్లి సంతోశ్‌కుమార్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మన్నె క్రిశాంక్, పాడి కౌశిక్‌రెడ్డి, కొణతం దిలీప్, క్రాంతి కిరణ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బాల్కసుమన్, గండ్ర వెంకటరమణారెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, జైసింహా, మన్నె గోవర్ధన్ ఇలా పదుల సంఖ్యలో బీఆర్ఎస్ నేతలపై చిన్నచిన్న కారణాలతో కేసులు నమోదు చేశారు. మన్నె క్రిశాంక్ ఒక్కడిపైనే 11 నెల్లలో 11 కేసులకు పైగా నమోదు చేశారంటే పోలీసుల తీరు ఎంత దారుణంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ విధంగా పెద్ద నేతల నుంచి మొదలు చిన్నస్థాయి నేతల వరకు సుమారు 200 మంది బీఆర్ఎస్ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేయడం గమనార్హం.

### సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ ఫిర్యాదులు

- 'మూసీకి అడ్డొస్తే ముక్కలుగా నరుకుతం.. బుల్డోజర్లతో తొక్కిస్తం' అంటూ కేసీఆర్, కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు నిరుడు నవంబర్ 9న బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- 'స్ట్రెచర్ ఉన్నాయన స్ట్రెచర్ మీదికి పోయిండు. స్ట్రెచర్ మీది నుంచి మార్చురీకి పోతడు రేపు పొద్దుగాల' అంటూ మాజీ సీఎం కేసీఆర్ మరణాన్ని కోరుకునేలా వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచితంగా ఫార్ములా-ఈ కార్ రేస్ ఒప్పందాన్ని రద్దు చేయడం వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.55 కోట్ల నష్టం జరిగిందని, తెలంగాణకు వచ్చే వేల కోట్ల పెట్టుబడులు ఇతర రాష్ర్టాలకు తరలిపోయాయని, రాష్ట్రంలో పెట్టుబడులకు విఘాతం కలిగించిన రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నార్సింగి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే ముఠా గోపాల్, నవీన్ కుమార్‌రెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు.

### సీఎంకు ఓ రూలు..సామాన్యులకు మరోటా? : ఆర్ఎస్పీ



'చేయని నేరానికి ఫార్ములా - ఈ రేస్ వ్యవహారంలో కేటీఆర్‌పై తప్పుడు కేసు పెట్టారు. నోటీసుల మీద నోటీసులు పంపుతున్నరు. ఎక్కడ పడితే అక్కడ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నరు. మరి ఫార్ములా-ఈ రేస్ రద్దుతో రాష్ర్టానికి రావాల్సిన వేల కోట్ల ఆదాయానికి గండిపడ్డదని నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు? ఫిర్యాదు దారును విచారించకుండానే కేసును మూసివేయడంలో అంతర్యమేంటి? అంటే సామాన్యులకు ఓ రూలు..సీఎంకు మరో రూలా?' అని శనివారం ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిలదీశారు. ముఖ్యమంత్రి, హోమంత్రిపై కేసు పెట్టవద్దని బీఎన్ఎస్ చట్టంలో ఎక్కడైనా ఉన్నదా? ఇదెక్కడి న్యాయం? అని ప్రశ్నించారు.

### సీఎం బూతులపై పోలీసులు ఎందుకు స్పందించరు?: వై సతీశ్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని బూతులు మాట్లాడినా, అనరాని మాటలన్నా స్పందించని పోలీసులు, అనుచిత వ్యాఖ్యలు చేశారనే నెపంతో కేటీఆర్‌పై కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి నిలదీశారు. కేటీఆర్ మాట్లాడిన దాంట్లో తప్పేమున్నదని, రేవంత్ బూతులతో పోల్చితే అవి చాలా చిన్నవని పేర్కొన్నారు. నాడు పీసీసీ చీఫ్‌గా, నేడు ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ చేసిన దారుణమైన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయని గుర్తుచేశారు. పెద్ద మనిషి అనే గౌరవం లేకుండా కేసీఆర్‌ను ఉద్దేశించి ఎంతగా దిగజారి మాట్లాడుతున్నారోనని చెప్పారు. ఆయన వయసును గౌరవించకుండా నీచమైన భాషను ప్రయోగించడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

## లోకం పోకడ




అయినా మన పిచ్చిగానీ, మైసూర్ పాక్‌లో మైసూర్ ఉందా? ప్రజాపాలనలో పాలనుందా?

## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 39.2°c | 24.8°c |
| ఖమ్మం | 38.0°c | 26.0°c |
| రంగారెడ్డి | 37.8°c | 20.1°c |
| నల్లగొండ | 37.5°c | 24.4°c |
| మెదక్ | 35.7°c | 25.7°c |
| మహబూబ్‌నగర్ | 35.0°c | 23.0°c |
| వరంగల్ | 35.0°c | 25.0°c |
| కరీంనగర్ | 34.0°c | 27.0°c |
| నిజామాబాద్ | 33.2°c | 26.4°c |
| హైదరాబాద్ | 31.4°c | 24.7°c |

## కేటీఆర్‌పై సైబర్ క్రైం కేసు

**ఎమ్మెల్సీ బల్మూరి ఫిర్యాదుతో నమోదు**

**చిక్కడపల్లి పీఎస్‌లో కాంగ్రెస్ లీగల్ సెల్ ఫిర్యాదు**

హైదరాబాద్ సిటీబ్యూరో/చిక్కడపల్లి, జూన్ 14 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుపై హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై బీఎన్ఎస్ సెక్షన్లు 353(2), 352 కింద కేసు నమోదు చేశారు. కేటీఆర్‌తోపాటు హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కూడా సైబర్ క్రైం పోలీసులు ఐటీ యాక్ట్ 67, బీఎన్ఎస్ సెక్షన్లు 353(2), 352 కింద కేసులు నమోదు చేశారు. కాంగ్రెస్ లీగల్ టీమ్ కేటీఆర్‌కు వ్యతిరేకంగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డిని కించపరిచేలా కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని, ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్, హైకోర్టు న్యాయవాది దోనేటి భాను, కాంగ్రెస్ నేతలు శనివారం చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## అన్నీ అర్హతలున్నా.. అందని 'ఆసరా'

**కొత్తగా ఒక్కరికీ పింఛన్ ఇవ్వని కాంగ్రెస్ సర్కారు**

**అర్హులను తేల్చడంలోనూ తీవ్ర జాప్యం**

**దాదాపు లక్ష మంది ఎదురుచూపులు**

**ఆర్థిక ఇబ్బందులు పడుతున్న దరఖాస్తుదారులు**

వరంగల్, జూన్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైన లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు ఇవ్వడంతోపాటు, నెలకు పింఛన్ రూ.4వేలకు ఇస్తామని చెప్పడంతో వేలాదిమంది ఎంతోఆశగా ఎదురుచూశారు. కానీ అధికారం చేపట్టిన తర్వాత కొత్త పింఛన్‌దారులను చేర్చకపోవడంతోపాటు, నెలకు రూ.4వేల హామీ అటకెక్కించింది. దీంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు నెలవారీ ఖర్చులు భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం 2022 ఆగస్టులో కొత్త పింఛన్లను మంజూరు చేసింది. ఆ తరువాత ప్రజా ప్రభుత్వం పేరిట ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఒక్కరిని కూడా ఆసరా పథకంలో చేర్చలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రజాపాలన కార్యక్రమంలోనూ లక్షలాది దరఖాస్తులు ఆసరా పింఛన్ల కోసం వచ్చినా.. వాటిని తూతూ మంత్రంగా స్వీకరించడం తప్పితే ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన దాదాపు లక్ష మంది ఆసరా పింఛను కోసం ఎదురుచూస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆసరా పథకం కింద వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, బోదకాలు బాధితులు, హెచ్ఐవీ బాధితులు, డయాలసిస్ పేషెంట్లు, వృద్ధ కళాకారులకు ప్రతినెలా ఆసరా పథకం ద్వారా పింఛన్ ఇచ్చి వారికి కొండంత అండగా నిలిచింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 11 క్యాటగిరీలలోని 39.41 లక్షలమంది ఆసరా లబ్ధిదారులు ఉండగా, దివ్యాంగులకు నెలకు రూ.4,016, వృద్ధ కళాకారులకు రూ.3,016, మిగిలిన తొమ్మిది వర్గాల వారికి రూ.2,016 చొప్పున పింఛన్లు ఇచ్చి ఆదుకున్నది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అందరికీ పింఛన్ మొత్తాన్ని రూ.4వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చి.. ఏడాదిన్నర గడిచినా ఇప్పటికీ అతీగతీ లేదు. నిబంధనల ప్రకారం వృద్ధాప్య పింఛన్ 65 ఏండ్లు దాటిన పేదలకు, 50ఏండ్లు దాటిన చేనేత, కల్లు గీత, బీడీ కార్మికులకు వారికి ఆసరా పింఛన్ ఇవ్వాలి. అలాగే వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితుల ఇంతే మొత్తాన్ని ఇవ్వాలి. కానీ కొత్తగా ఏర్పడిన రేవంత్ సర్కారు నిధుల లేమి కారణంగా చూపుతూ కొత్తగా ఆసరా పథకంలో లబ్ధిదారులను చేర్చడం లేదు.

# ఏడాది దాటిందో మొత్తం కట్టాల్సిందే!



మొదటిపేజీ తరువాయి...

కోసం ముందుకెళ్లాల్సి ఉంటుంది. గతంలో గోల్డ్‌లోన్ తీసుకుంటే ఏడాదికోసారి వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకొనే సౌలభ్యం ఉండేది. కానీ, ఇప్పుడు దానిని తొలగించారు. 12 నెలలు గరిష్ఠ పరిమితి విధించారు. 12 నెలలు దాటితే రుణంతోపాటు వడ్డీ మొత్తం చెల్లించాల్సిందే. మళ్లీ రుణం కూడా అదే రోజు ఇవ్వరు. లోను చెల్లించిన తర్వాత మరుసటి రోజు తిరిగి ఆ బంగారం ద్వారా రుణం పొందాలనే నిబంధన పెట్టారు.

### 15 నెలలు దాటితే బంగారం వేలం

బ్యాంకులో బంగారం కుదువబెట్టి తీసుకున్న లోను మొత్తాన్ని గరిష్ఠంగా 12 నెలల్లోగా అసలు తోపాటు వడ్డీ కూడా చెల్లించాలి. గడువులోగా చెల్లించకుంటే రుణగ్రస్తులను బ్యాంకులు డిఫాల్టర్‌గా ప్రకటిస్తాయి. అదనంగా 3 నెలలు దాటితే.. అంటే రుణం తీసుకొని 15 నెలలు దాటితే రుణగ్రస్తులకు సమాచారం అందించి బంగారం వేలం వేస్తారు. గతంలో ఇలాంటి నిబంధన లేదు. ఇప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ఏడాదిలోగా రుణం మొత్తాన్ని వడ్డీతో కలిపి చెల్లించాల్సిందే.

### రుణ పునరుద్ధరణకు షరతులు

లోన్-టు-వాల్యూ (ఎల్‌టీవీ) నిష్పత్తి ప్రకారం బంగారం (22 క్యారెట్లు) విలువలో 75 శాతం వరకు మాత్రమే రుణం ఇస్తారు. రుణ మొత్తాన్ని వడ్డీతోసహా గరిష్ఠంగా 12 నెలల్లోగా చెల్లించాలి. ప్రైవేటు, బిజినెస్ ఈఎంఐ ఆధారిత రుణాలకు 36 నెలలు వరకు గడువు ఉన్నది. రుణం పునరుద్ధరించాలంటే కూడా ఆర్బీఐ కొన్ని షరతులు విధించింది. రుణ ఖాతా యాక్టివ్‌గా ఉండాలి. మొత్తం వడ్డీ చెల్లించి ఉండాలి. బంగారం విలువ నిర్ధారణ, వేలం ప్రక్రియలో పూర్తి పారదర్శకత తప్పనిసరిగా ఉండాలి. రుణం చెల్లింపు కాలం తగ్గడం, కఠిన షరతులు ప్రజలను ఆర్థిక ఒత్తిడికి గురిచేసే ప్రమాదం ఉన్నది.

### వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులు పోల్చి చూడాలి

బంగారు రుణం తీసుకునే ముందు రుణగ్రహీతలు వివిధ బ్యాంకుల వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులను పోల్చి చూడాలి. ఏది మనకు అనుకూలంగా ఉంటుందో అంచనా వేసుకొని ఆ బ్యాంకులోనే రుణం తీసుకోవాలి. రుణం చెల్లించే సామర్థ్యాన్ని అంచనా వేసుకోవాలి. లేదంటే బంగారం వేలం వేసే ప్రమాదం ఉంటుంది. తీసుకున్న రుణం ఎంత? వడ్డీ ఎంత? ఈఎంఐ ఎంత? మొత్తం పరిగణనలోకి తీసుకోవాలి. ఆర్బీఐ నూతన నిబంధనలు గోల్డ్‌లోన్లను మరింత క్రమబద్ధీకరించినప్పటికీ, రుణగ్రహీతలు తమ ఆర్థిక స్థితిని జాగ్రత్తగా విశ్లేషించి నిర్ణయం తీసుకోవాలి. లేదంటే, బంగారం కోల్పోవడంతోపాటు ఆర్థిక కష్టాలు కొని తెచ్చుకోవాల్సి ఉంటుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ)**
వడ్డీ రేటు: 8.85%-9.6% (వ్యవసాయ రుణాలకు 8.85% నుంచి)
చెల్లింపు కాలం: మొత్తం చెల్లింపు గరిష్ఠంగా 12 నెలలు, ఈఎంఐ కోసం 36 నెలలు
ప్రాసెసింగ్ ఫీజు: రూ. 3 లక్షల వరకు రుణాలకు ఫీజు లేదు. ఆపై 0.50%
ప్రత్యేకత: తక్కువ ప్రాసెసింగ్ ఫీజు, వ్యవసాయ రుణాలకు అనుకూల వడ్డీ రేట్లు

**భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్బీఐ)**
వడ్డీ రేటు: 8.75%-9.45%
చెల్లింపు కాలం: 12 నెలలు (బుల్లెట్), 36 నెలలు (ఈఎంఐ)
ప్రాసెసింగ్ ఫీజు: 3 లక్షల వరకు రుణాలకు ఫీజు లేదు. ఆపై 0.50% + జీఎస్టీ
ప్రత్యేకత: వేగవంతమైన ప్రాసెసింగ్, తక్కువ డాక్యుమెంటేషన్

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు**
వడ్డీ రేటు: 8.50%-9.90%
చెల్లింపు కాలం: 12 నెలలు, 24-36 నెలలు (ఈఎంఐ)
ప్రాసెసింగ్ ఫీజు: 0.50%-1% + జీఎస్టీ
ప్రత్యేకత: డిజిటల్ గోల్డ్‌లోన్ సౌకర్యం

**ఐసీఐసీఐ బ్యాంక్**
వడ్డీ రేటు: 8.75%-9.50%
చెల్లింపు కాలం: 12 నెలలు (బుల్లెట్), 36 నెలలు (ఈఎంఐ)
ప్రాసెసింగ్ ఫీజు: 0.50%-1% + జీఎస్టీ
ప్రత్యేకత: వ్యక్తిగత అవసరాల కోసం ఫ్లెక్సిబుల్ రుణాలు

**కెనరా బ్యాంక్**
వడ్డీ రేటు: 8.85%-9.25%
చెల్లింపు కాలం: 12 నెలలు (బుల్లెట్), 36 నెలలు (ఈఎంఐ)
ప్రాసెసింగ్ ఫీజు: 0.50% + జీఎస్టీ.
ప్రత్యేకత: వ్యవసాయ, వ్యక్తిగత రుణాలకు అనుకూలం

### ఒక్కో బ్యాంకు ఒక్కో వడ్డీ

గోల్డ్ లోన్ల వడ్డీ రేట్లు, ప్రాసెసింగ్ ఫీజులు కూడా వివిధ బ్యాంకులను బట్టి మారుతూ ఉన్నాయి. కొన్ని బ్యాంకులు 8 శాతం వడ్డీ వేస్తే, మరికొన్ని బ్యాంకులు కొంత ఎక్కువగా, ఇంకొన్ని తక్కువ వడ్డీలు విధిస్తున్నాయి. ప్రాసెసింగ్ ఫీజు విషయంలో కూడా వివిధ టారిఫ్‌లను అమలు చేస్తున్నాయి. కొన్ని బ్యాంకులు 3 లక్షల వరకు ప్రాసెసింగ్ ఫీజు విధించకపోగా, మరికొన్ని బ్యాంకులు విధిస్తున్నాయి.


# గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్

మొదటిపేజీ తరువాయి...

ఏర్పాటుచేస్తేనే కంపెనీలు మనదగ్గరకు వస్తాయని కేసీఆర్ ప్రభుత్వం ముందే గుర్తించింది. ఈ క్రమంలోనే ఐటీ మౌలిక వసతులను అందుబాటులోకి తేవడంతోపాటు కంపెనీలకు కావాల్సిన ప్రోత్సాహకాలను అందించింది. 'టాస్క్' వంటి కార్యక్రమాలతో పారిశ్రామిక అవసరాలకు కావాల్సిన మానవ, సాంకేతిక వనరులను కల్పించింది. దీంతో ప్రపంచ దిగ్గజ కంపెనీలు తమ గ్లోబల్ కేపబులిటీ సెంటర్లను (జీసీసీ) హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి క్యూకట్టాయి. జీసీసీలను ఆకర్షించడంలో 'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా'గా పిలిచే బెంగళూరును తోసిరాజని హైదరాబాద్ ముందువరుసలో నిలిచిందంటే కేసీఆర్ ప్రభుత్వం వేసిన అప్పటి 'ఐటీ' పునాదులేనని చెప్పకతప్పదు. గ్లోబల్ టెక్ కంపెనీలను ఏర్పాటు చేయడమే కాదు సుశిక్షితులైన ఉద్యోగులను కూడా అందిస్తూ మల్టీనేషనల్ కంపెనీలను ఆకర్షించడంలో హైదరాబాద్ దేశానికే దిక్సూచీగా నిలిచింది. అందుకే గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల(జీసీసీ)కు కేంద్ర బిందువుగా హైదరాబాద్ మారింది. దేశవ్యాప్తంగా రెండు వేల జీసీసీ ఎకో సిస్టమ్‌లుండగా.. హైదరాబాద్‌లోనే 355 జీసీసీలున్నాయి. అంటే దేశంలో కొత్తగా ప్రారంభించే ప్రతీ 100 జీసీసీల్లో 18 సెంటర్లు హైదరాబాద్‌లోనే కొలువుదీరుతున్నాయి. తద్వారా దేశంలో అత్యధికంగా జీసీసీ సెంటర్లు ఉన్న రాష్ర్టాల్లో తెలంగాణ ముందు వరుసలో నిలిచింది. హైదరాబాద్‌లోని మొత్తం జీసీసీల్లో 3 లక్షల మంది ఉద్యోగాలు చేస్తున్నారు. వచ్చే ఐదు నుంచి ఏడేండ్ల కాలంలో 35-40 శాతం కొత్త జీసీసీలు మన దేశంలో ప్రారంభం కానున్నట్టు నివేదికలు చెప్తున్నాయి. వాటన్నింటికీ గమ్యస్థానం హైదరాబాద్ కాబోతున్నట్టు పారిశ్రామిక నిపుణులు అంచ నా వేస్తున్నారు. ఐటీ, రీసెర్చ్, ఫైనాన్స్, కస్టమర్ సేవల కోసం ఎంఎన్‌సీలు హైదరాబాద్‌లో ఇప్పటికే వందలాది జీసీసీలను ఏర్పాటు చేశాయి. ప్రతిష్ఠాత్మక ఎలీ లిల్లీ, మారియట్ ఇంటర్నేషనల్, ఎవర్‌నార్త్ వంటి సంస్థలు తమ గ్లోబల్ సెంటర్లను హైదరాబాద్‌లో ప్రారంభించాయి. దీంతో గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌గా హైదరాబాద్ మారినట్టు అర్థమవుతున్నది.

### బీఆర్ఎస్ హయాంలో కేటీఆర్ ప్రత్యేక చొరవ

నాడు బీఆర్ఎస్‌పాలనలో ఐటీ రంగం అభివృద్ధికి ప్రవేశపెట్టిన పాలసీలతో అనేక జీసీసీలు రాష్ట్రంలో తమ సంస్థలు పెట్టేందుకు మొగ్గుచూపుతున్నట్టు పారిశ్రామిక రంగ నిపుణులు చెప్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పన, ప్రతిభా సామర్థ్య వృద్ధి, ఐటీ సెక్టార్‌లో వినూత్న ఆవిష్కరణలు, అత్యున్నత జీవన ప్రమాణాలు వెరసి ప్రపంచ స్థాయి దిగ్గజ కంపెనీలు హైదరాబాద్ వైపు చూసేలా చేస్తున్నట్టు వివరిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో నాటి ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో తెలంగాణలో వ్యాపార అనుకూల వాతావరణం, ప్రభుత్వపరంగా ప్రోత్సాహం, ఐటీ మౌలిక వసతులను అందుబాటులోకి తేవడంతో అనేక జీసీసీలు తెలంగాణ బాట పట్టాయి. ఐటీ పరిశ్రమలకు 15 రోజుల్లో అనుమతి ఇవ్వడానికి టీఎస్ఐపాస్, టీఎస్‌బీపాస్ వంటి కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. కేటీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ద్వారా ఇస్తున్న శిక్షణ ఆయా జీసీసీలతో పాటు ఐటీ కంపెనీల్లో ఉద్యోగార్థులకు ఎంతగానో ఉపయోగపడింది. దేశంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ టీహబ్, టీహబ్ 2.0, మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు వీహబ్‌లను బీఆర్ఎస్ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. వీటిద్వారా సుశిక్షితులైన ఉద్యోగులు గ్లోబల్ కంపెనీల చేతికొచ్చారు.



### ఏమిటీ జీసీసీ?

**ఇతర** దేశాల్లోని ప్రతిభావంతుల సేవలను, కార్యనిర్వహణ సామర్థ్యాన్ని తక్కువ ఖర్చుతో ఉపయోగించుకోవడానికి ఎంఎన్‌సీ కంపెనీలు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేస్తాయి. వాటినే గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీ)గా పిలుస్తారు. ఆ కంపెనీలు తమ వ్యాపార వృద్ధికి ఈ కేంద్రాలలోని మానవ, సాంకేతిక వనరులను వినియోగించుకొంటాయి. హైదరాబాద్ కేంద్రం గా నడిచే జీసీసీలు దేశవ్యాప్తంగా స్టార్టప్ కల్చర్‌కు దశ, దిశను చూపుతున్నట్టు నిపుణులు చెప్తున్నారు.

### పాలసీల రూపకల్పనలో రోల్‌మాడల్

ఐటీ రంగానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ ఐదేండ్లకు ఒకసారి ఐటీ పాలసీని కొత్తగా రూపొందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే 2016, 2021లో పాలసీలను రూపొందించి విజయవంతంగా అమలు చేసింది. వీటికి తోడు ఐటీ శాఖ పరిధిలోఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్‌ను ఏర్పాటు చేసి 10 టెక్నాలజీలను ప్రభుత్వ కార్యకలాపాలకు సమర్థవంతంగా వినియోగించింది. టెక్నాలజీ రంగంలో వస్తున్న కొత్త మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకొనేందుకు అప్పటి ఐటీమంత్రి కేటీఆర్ నేతృత్వంలో ఐటీశాఖ ముందుచూపుతో వ్యవహరించింది. వీటి ఫలితమే.. ప్రపంచంలోనే టాప్-5 టెక్ కంపెనీలు హైదరాబాద్‌కు క్యూకట్టాయి. పదేండ్లలో ఐటీ ఎగుమతులు నాలుగు రెట్లు పెరిగాయి. దేశంలోని ప్రతీ 3 కొత్త ఐటీ ఉద్యోగాల్లో ఒకటి తెలంగాణ నుంచే సాకారమైంది.

### ఐదేండ్లలో జీసీసీలు క్యూ

గడిచిన ఐదేండ్లలో హైదరాబాద్‌కు జీసీసీలు క్యూకట్టాయి. ఇక్కడ ఉన్న మౌలిక వసతులు, టాలెంటే దానికి కారణం.

- శ్రీకాంత్ శ్రీనివాసన్, నాస్కామ్ వీపీ

### ఐటీ వాతావరణం అద్భుతం

జీసీసీలకు అడ్డాగా హైదరాబాద్ మారింది. గడిచిన 18 నెలల్లో దేశంలో ప్రారంభమైన 25-30 శాతం జీసీసీలు హైదరాబాద్‌కే రావడం దీనికి రుజువు. ఇక్కడి ఐటీ వాతావరణం ఎంతో బాగుంది.

-విక్రమ్ అహూజా, ఎన్ఎస్ఆర్ సహ వ్యవస్థాపకుడు

### హైదరాబాద్ ఎంతో బెటర్

మిగిలిన మెట్రో సిటీలతో పోలిస్తే హైదరాబాద్ ఎంతో బెటర్. టాలెంట్ ఉన్న ఉద్యోగులు ఇక్కడ దొరుకుతారు. బెంగళూరు, ముంబైతో పోలిస్తే ఇక్కడ కాస్ట్ ఆఫ్ లివింగ్ ఎంతో తక్కువ. ఢిల్లీతో పోలిస్తే భద్రతపరంగా హైదరాబాద్ సౌకర్యవంతంగా ఉంటుంది. రవాణా సదుపాయాలు కూడా మెరుగ్గా ఉన్నాయి.

- కార్తీక్ పద్మనాభన్, జిన్నోవ్ మేనేజింగ్ పార్ట్‌నర్

### బెంగళూరుకు బెంగ

'సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా'గా చెప్పుకొనే బెంగళూరును తోసిరాజని ఐటీహబ్‌గా హైదరాబాద్ మారుతున్నది. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తీసుకొన్న నిర్ణయాలే ఇందుకు కారణమయ్యాయి.

**గడిచిన ఐదేండ్లలో జీసీసీల పెరుగుదల ఇలా**

- హైదరాబాద్ +35.7%
- పుణె +11.11%
- చెన్నై మార్పులేదు
- ఢిల్లీ -6.6%
- బెంగళూరు -16.66%
- ముంబై -16.66%

ఆధారం: ఏఎన్ఎస్ఆర్ రీసెర్చ్-2025

**టెక్నాలజీ రంగంలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీలు**

2016 - తెలంగాణ ఐసీటీ పాలసీ
2016 - ఎలక్ట్రానిక్స్ పాలసీ
2016 - ఇన్నోవేషన్ పాలసీ
2016 - డేటా సెంటర్స్ పాలసీ (దేశంలోనే మొదటిది)
2017 - ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) పాలసీ
2019 - బ్లాక్ చెయిన్ పాలసీ (దేశంలోనే మొదటిది)